డీలర్ల మాయాజాలం

- ఒక్కో కార్డుదారుడికి 2 కిలోల బియ్యం తక్కువగా పంపిణీ
- కొన్ని నెలలుగా ఇదే తంతు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని క్రిష్టాపురం జీరో రోడ్డులోని ఉన్న స్టోర్‌లో కార్డుకు రెండు కిలోల తక్కువగా బియ్యాన్ని ఇస్తున్నారన్న ఫిర్యాదులపై బుధవారం సాక్షి ప్రతినిధి వెళ్లి పరిశీలించారు. ఎలక్ట్రానిక్ కాటాపై అరకిలో చక్కెర ప్యాకెట్లను పెట్టి బియ్యం సంచిని తూకం వేయడం కనిపించింది. కార్డు లబ్ధిదారునికి 25 కిలోలకుగాను కేవలం 23 కిలోలు మాత్రమే ఇచ్చారు. కార్డుదారునికి మాత్రం కాటాలో 25 కిలోలు కనిపిస్తుంటాయి కానీ కాటా కింద మాత్రం నాలుగు అర కిలోల చక్కెర ప్యాకెట్లు కనిపించవు. ఇదే విషయాన్ని అక్కడున్న పంపిణీదారుడిని అడిగితే రేషన్ గోడౌన్‌లో 50 కిలోల బస్తాకు రెండు కిలోల చొప్పున తక్కువగా బియ్యం వస్తున్నాయని, దాన్ని భర్తీ చేయడానికి కార్డుదారులకు తక్కువగా ఇస్తున్నామని నిర్భయంగా చెప్పడం గమనార్హం. ఇదే విషయాన్ని గోడౌన్ ఇన్‌చార్జ్ శ్రీరాములును వివరణ కోరగా పంపిణీదారుడు చెబుతున్న దాంట్లో వాస్తవం లేదని, డీలర్లు వచ్చి గోడౌన్‌లో బస్తాలను తూకం వేయించుకోని వెళ్లాలని ఎన్నో మార్లు చెప్పామని, వారు తమ మాట వినకుండా ప్రైవేట్‌గా తూకం వేయించుకుంటామని చెబుతూ వెళుతున్నారన్నారు. ఇప్పుడు బస్తాకు రెండు కిలోల బియ్యం తక్కువగా వస్తున్నాయంటూ చెప్పడం విడ్డూరంగా ఉందని చెప్పుకొచ్చారు.

అధికారుల పర్యవేక్షణ లోపం

తాడిపత్రి పట్టణ, రూరల్ పరిధిలోని ఎక్కువ మంది కూటమి పార్టీలకు చెందిన మద్దతుదారులే డీలర్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టణ,రూరల్ పరిధిలో 93 మంది డీలర్లు ఉండగా ప్రతి నెల దాదాపు 7500 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతున్నాయి. ఇందులో ఎంత మొత్తంలో బియ్యం లబ్ధిదారులకు చెందుతున్నాయో, పక్కదారి పడుతూ డీలర్ల జేబులు నింపుతున్నారో నిగ్గు తేల్చాల్సిన అధికార యంత్రంగం నిద్రమత్తులో జోగుతోంది. రేషన్ పంపిణీని తాహసీల్దార్, సీఎస్‌డీటీలు పర్యవేక్షించాల్సి ఉంది. వీరి పర్యవేక్షణ లోపం పలువురు డీలర్లకు వరంగా మారుతోంది. వివిధ సమావేశాల పేరుతో కార్యాలయంలో డీలర్లను సమావేశపరచి పలు రకాల హెచ్చరికలతో పంపివేస్తున్నారే తప్ప, అచరణలో రేషన్ దుకాణాలను తనిఖీ చేసి డీలర్లపై చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు ప్రత్యక్ష కార్యాచరణకు దిగి తమకు న్యాయం చేకూర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



కాటాపై అరకిలో చక్కెర ప్యాకెట్లను పెట్టిన దృశ్యం



కాటాలో చక్కెర ప్యాకెట్లతో కలిపి బియ్యం సంచి 25 కిలోలు చూపిస్తున్న దృశ్యం

డీలర్లపై చర్యలు తీసుకుంటాం



కార్డుదారులకు తక్కువ బియ్యం వేసే డీలర్లపై చర్యలు తీసుకుంటాం. గురువారం నుంచి సీఎస్‌డీటీ ద్వారా డీలర్‌షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. తక్కువగా బియ్యం వేస్తున్న డీలర్లపై లబ్ధిదారులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– సోమశేఖర్, తహసీల్దార్

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



రామచంద్రారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలం ఆలూరు గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు రామచంద్రారెడ్డి అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం ఆస్పత్రికి చేరుకుని రామచంద్రారెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పేద మహిళకు చేయూత



మేఘనకు కుట్టుమిషన్, ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్: చిన్న వయస్సులోనే భర్తను కోల్పోయి కుటుంబపోషణ భారమై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పత్తికొండ మండలం పందికోన గ్రామానికి చెందిన మేఘన అనే మహిళకు కావలి పాలేగార్ల సంక్షేమ సంఘం ఆర్థిక చేయూతనందించింది. బుధవారం ఎస్‌ఎల్‌వీ థియేటర్ వద్దనున్న ఎల్లమ్మగుడి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెకు కుట్టుమిషన్‌తోపాటు రూ.63 వేల నగదు, నిత్యావసరాలను అందజేశారు. మేఘనకు చేయూతనందించిన కులస్తులు, దాతలందరికీ సంఘం పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు.

చెత్త రోడ్లపై పారేయొద్దు



దుకాణ యజమానులతో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ శశికళ

యాడికి: దుకాణాల వద్దనున్న చెత్తను రోడ్ల పారేయకుండా చెత్తకుండీల్లో ఈఓఆర్‌డీ శశికళ వ్యాపారులకు సూచించారు. మండల కేంద్రంలోని కుంటను ఈఓపీఆర్‌డీ శశికళ పరిశీలించారు. ఈ సందర్భంగా కుంటలో ఉన్న దుకాణ యజమానులతో శశికళ మాట్లాడుతూ దుకాణదారులు చెత్తను పంచాయతీ వాహనాలు వచ్చినప్పుడు అందులో వేయాలన్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు.

విద్యతోనే భవిష్యత్‌కు నాంది



స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులతో ఆర్యరాజ్ ఫౌండేషన్ సభ్యులు

గుంతకల్లు: ప్రతి ఒక్కరికీ విద్యతోనే బంగారు భవిష్యత్‌కు నాంది పడుతుందని వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మిల్ ఏరియాలోని సరస్వతీ విద్యా మందిరం హైస్కూల్ ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన కే.సాయిచరణ్, పీ.లోకేశ్వర్, బీ.అకీరా, కే.తేజస్వినికి రూ.10 వేల చొప్పున ఆర్యరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతి అందించినట్లు పాఠశాల అధ్యక్షురాలు వసుంధర తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు రామకృష్ణనాయుడు, శ్రీనివాసులు, గోపాల్‌రావు, చలపతి మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనిబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యామందిరంలో చదివే విద్యార్థులకు సంస్కారంతో కూడిన విద్య అందుతుందన్నారు. ప్రిన్సిపాల్ దామోదర్‌నాయుడు, పాఠశాల ఉపాధ్యక్షుడు సుధీంద్రరెడ్డి, సభ్యుడు మారుతీ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో సమస్యలుంటే తెలపండి

యల్లనూరు: భూముల రీ సర్వేలో సమస్యలుంటే తెలియజేయాలని తహసీల్దార్ రాము సిబ్బందికి సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే చేసిన గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చాలా మంది రైతుల రిజిస్ట్రేషన్ భూములు డైగ్లాట్‌లో బంజరు, ప్రభుత్వ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదయ్యాయన్నారు. అలాంటి వాటికి కలెక్టరు ఆదేశాల మేరకు సత్వరమే న్యాయం చేస్తామన్నారు. మండల సర్వేయర్ షర్మిలీ, వీఆర్వోలు పాల్గొన్నారు. భూ సమస్యలు ఏవైనా ఉంటే నా దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ రాము తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గుంతకల్లు: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయస్వామి, ఉపాధ్యక్షులు వెంకట్‌నాయక్, నరసింహ యాదవ్, మంజునాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌డీఓ కార్యాలయం ముంగిట ఖాళీ ప్లేట్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కుళ్లాయప్ప మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిపులు, బకాయిలు రూ.6,400 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే విద్యార్థుల కష్టాలు తీరుస్తామని విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బడ్జెట్ సమావేశంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి రూ.2,600 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించిన నేటికి ఒక్క రూపాయి కూడా విద్యార్థుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. విద్యార్థుల కోర్సులు పూర్తయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77ను రద్దు చేస్తామన్నా హామీని తొంగలోకి తొక్కారని విమర్శించారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అఖిల్, శివమణి, ఫరహాన్ ముజీర్, సంతోష్, కుమార్‌ప్రసాద్, కార్తీక్, భాస్కర్, అన్వర్, తేజ, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినూత్న నిరసన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

గుత్తి: న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అలాగే 36 జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, కార్మికుడు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆది, రామాంజి, సూరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



మర్తాడులో సమావేశమైన నాయకులు

గార్లదిన్నె: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని మండల కన్వీనర్ ఎల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మర్తాడులో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు.

2029లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా సాకే శైలజానాథ్‌ను గెలుపించుకునేందుకు సైనికుల్లా పని చేద్దామన్నారు. అనంతరం నూతనంగా నియమితులైన మండల కన్వీనర్ ఎల్లారెడ్డిని నాయకులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కారించారు.

సంక్షిప్త సమాచారం

బాలిక అదృశ్యం

పామిడి: పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఓ బాలిక(17) అదృశ్యమైంది. వివారాలు.. బుధవారం మధ్యాహ్నం కుట్టుశిక్షణ శిక్షణ కేంద్రానికి వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ఫలితం లేకపోయింది. బాలిక తండ్రి అలీబాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ బీఆర్ ప్రసాద్ తెలిపారు.

తేనెటీగల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు



గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం సూర్య తండాలో బుధవారం తేనెటీగల దాడిలో సుబ్బమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. సుబ్బమ్మ గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తుండేది. ఈ క్రమంలో గ్రామ శివారులోని కొండ ప్రాంతంలో గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లింది. అయితే కొండలో నుంచి ఒక్కసారిగా తేనెటీగలు సుబ్బమ్మపై దాడి చేసి గాయపరిచాయి. గమనించిన తోటి గొర్రెల కాపరులు వెంటనే సుబ్బమ్మను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం తీసుకెళ్లారు.

‘పెళ్లి చేసుకోకపోతే.. చంపేస్తా’

- యువతికి యువకుడి బెదిరింపు

అనంతపురం: పెళ్లి చేసుకోకపోతే చంపేస్తా అంటూ ఓ యువతిపై దాడి చేసిన యువకుడు ఘటన అనంతపురం నగరంలో చోటు చేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. పుట్లూరు మండలం శనగల గూడూరుకు చెందిన యువతి సాయినగర్ ఏడో క్రాస్‌లోని లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. రెండు సంవత్సరాల క్రితం అనంతపురం నగరంలోని బస్టాండు వద్ద ఉన్న ప్రియదర్శిని హోటల్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్న ఈమెకు.. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం అగ్రహారంకు చెందిన ప్రవీణ్ కుమార్ పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నా.. పెళ్లి చేసుకుందాం అని చెప్పగా యువతి నిరాకరించింది. ఈ క్రమంలోనే ఇటీవల విద్యుత్ నగర్‌లో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు హోంలోన్ విభాగంలో సేల్స్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరింది. విషయం తెలుసుకున్న ప్రవీణ్ కుమార్ మళ్లీ ఆమె వెంట పడుతూ పెళ్లి చేసుకోవాలని వేధించడం ప్రారంభించాడు. మంగళవారం హాస్టల్ వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. బైకులో బలవంతంగా ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి దాడి చేశాడు. వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంటే చంపుతా అని బెదిరించాడు. తిరిగి బైక్‌పై హాస్టల్ వద్ద వదిలి వెళ్లిపోయాడు. దీనిపై తన సోదరితో కలిసి యువతి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



యాడికిలో ఉపాధ్యాయులను సత్కరించిన హెచ్‌ఎం సీతారామాంజనేయులు, ఉపాధ్యాయులు



పుట్లూరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి, సిబ్బంది

యాడికి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు నాగన్న, విశ్వనాథ్, చంద్రశేఖర్, క్రిష్ణమూర్తి, హాజీవలి, బండి రామాంజనేయులుతో పాటు మరో 12 మంది సేవలను వక్తలు కొనియాడారు. ఉపాధ్యాయులను విశ్రాంత హెచ్‌ఎం విజయబాస్కర్‌రెడ్డి, విజయమ్మ తదితరులు ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.

పుట్లూరు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సత్యనారాయణ, అరుణ్, సుమలత, రమణ, శేఖరయ్య, సుకన్య, రజిని, నూర్జహాన్, మాధురి, భారతి తదితరులును ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఆదర్శ పాఠశాలలో ఉత్తమ ఫలితాలను సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయుల కృషిని వారు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల వేధింపులు ఆపాలి



ఎంఈఓ రవినాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు

గుత్తి: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై అధికారుల వేధింపులు ఆపాలని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు షెక్షావలి, రంగారావు, వేదమూర్తి, బాబు, జయరాం, ప్రసాద్, చైతన్య తదితరులు కోరారు. ఈమేరకు బుధవారం ఎంఈఓ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా వేధింపులు తప్పడం లేదన్నారు. దీన్ని నిరసిస్తూ గురువారం పాఠశాలలను బంద్ చేస్తున్నామన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యేని సన్మానించిన నాయకులు

గుత్తి రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి నాయకులకు సూచించారు. నూతనంగా నియమితులైన ఎస్టీ సెల్ గుత్తి మండలాధ్యక్షుడు లాలునాయక్, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు బుధవారం గుంతకల్లులోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో మాజీ ఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రీకాలింగ్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు. జగన్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకులు బాలాజీనాయక్, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు విరివిగా చేపట్టండి

యల్లనూరు: మండలంలో ఉపాధి హామీ పనులను విరివిగా చేపట్టాలని ఎంపీడీఓ కరుణ సాగర్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. బినామీ కూలీల హాజరుశాతం తగ్గించాలని ఏపీఓ ఓబిరెడ్డికి ఆదేశించారు. ఈసీ సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు జయరాం, కుళ్లాయిస్వామి, హరికుమార్‌రెడ్డి, ప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, పురుషోత్తంనాయుడు, రాంబాబు, పీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

యల్లనూరు: గ్రామాలోల మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం బొప్పేపల్లి, వాసాపురం , అచ్యుతాపురం, చిలమకూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గొడవలకు దిగకుండా శాంతియుతంగా పండుగను జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే పోలీసుకురావాలని సూచించారు.

పామిడిలో మోస్తరు వర్షం

పామిడి: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం పడింది. మేఘామృతమైన ఆకాశం మధ్యాహ్నం వర్షించింది. దీంతో రోడ్లు, కాలువలు జలమయ్యాయి. దీంతో పాదచారులు, వాహనచోదకుల రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు.

పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని డబ్బేదార్ ఫిర్కా, రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో పెద్ద విఠోబ, చిన్న విఠోబ దేవాలయాల్లో ఈ నెల 5 నుంచి 11వ వరకూ నిర్వహించే బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆయా ఫిర్కాల సభ్యులు బుధవారం కోరారు. ఈ 5 9 వతేదీ వరకూ ఆయా ఆలయాల్లో రుక్మిణీ పాండురంగస్వామికి వేదపండితులతో జపాలు, హోమాలు, పూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 10వ తేదీ సాయంత్రం రుక్మిణీ పాండురంగస్వాముల ఢైయిండి రథోత్సవం ఉంటుందన్నారు. 11వ తేదీ సాయంత్రం నిర్వహించే వసంతోత్సవం బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. అలాగే 15న ఆషాడ బహుళ పంచమిని పురస్కరించుకొని పామిడమ్మ దేవత హారతి నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులందరికీ కృతజ్ఞతలు

- మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



గుంతకల్లుటౌన్: ‘రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో’ బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ’ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణకై గుంతకల్లులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి భారీగా తరలివచ్చిన గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాలకు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులందరికీ మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు చేసిన మోసాలను ఇంటింటికీ వివరించాలని ఆయన బుధవారం ఓ ప్రకటన ద్వారా కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

ఓబుళాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

సాక్షి ఎఫెక్ట్..

గుంతకల్లు రూరల్: గత ప్రభుత్వంలో పూర్తయిన ఓబుళాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం ప్రారంభించారు. విద్యుత్ ఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చొరవతో సబ్‌స్టేషన్ మంజూరు చేయించడంతోపాటు నిర్మాణం పూర్తి చేయించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభం ఆగిపోయింది. తరువాత కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తవుతున్నా సబ్‌స్టేషన్‌ను ప్రారంభించే ఆలోచన మాత్రం చేయలేదు. దీనిపై వేధిస్తున్న లో ఓల్టేజీ సమస్య.. ప్రారంభానికి నోచుకొని సబ్‌స్టేషన్ శీర్షిక ఇటీవల రోజుల క్రితం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో సబ్‌స్టేషన్‌ను ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో డీఈ పద్మనాభపిల్లై, ఏడీఈ నాగేంద్ర, కన్‌స్ట్రక్షన్స్ డీఈ రవిశంకర్, ఏడీఈ రంగస్వామి ఇతర సిబ్బంది, ఎంపీపీ బీవీ మాధవి, గ్రామ సర్పంచ్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీలకు నైపుణ్యాలు అవసరం

బుక్కరాయసముద్రం: ఫ్యాకల్టీలకు నైపుణ్యాలు ఎంతో అవసరం అని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ పేర్కొన్నారు. బుధవారం రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం (ఈసీఈ) ఐఓటీ అప్లికేషన్ రూపకల్పన, అభివృద్ధిపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ బాలకృ మాట్లాడుతూ అధ్యాపకులు సాంకేతిక అంశాలను అనుసంధానం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. బోధనలో అధ్యాపకులు తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రవిచంద్ర, శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

‘అర్హత ఉన్నా పింఛన్ రావడం లేదు’

గుంతకల్లు రూరల్: అర్హత ఉన్నా తమకు పింఛన్ రావడం లేదంటూ పలువురు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వద్ద తమ సమస్యను ఏకరువుపెట్టారు. బుధవారం ఎమ్మెల్యే కసాపురం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రజలు పింఛన్లు, పక్కాగృహాలు, తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే కొత్త పింఛన్లతోపాటు, హౌసింగ్ ద్వారా అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఆనంద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఆనంద్ పని నిమిత్తం యాడికికి బయలుదేరాడు. అయితే జక్కలచెరువు గ్రామ శివారులో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆనంద్‌ను వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.